
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 9 జూన్ 2024

'గులాబీ'కి మరో దెబ్బ!



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలోనూ బీఆర్ఎస్ ఓటమి
- గతంలో ఇదే స్థానంలో నాలుగు సార్లు విజయం
- ఇటీవలి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కుదేలు
- కంచుకోటలో వరుస పరాజయాలతో కేడర్ పక్కచూపులు
- తొలిసారిగా పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ పాగా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న పోరుగల్లు.. ఓరుగల్లులో ఆ పార్టీకి మరో దెబ్బ తగిలింది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వరుస ఓటములు చవిచూసిన ఆ పార్టీకి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ పరాభవం తప్పలేదు. దాంతో కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలు బీటలు వారుతుండం.. వరుస పరాజయాలు ఎదురవుతుండటంతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్న గులాబీ కేడర్ పక్క చూపులు చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే లోక్‌సభ ఎన్నికల్లో పరాజయంతో తీవ్ర నిరాశలో ఉండగా.. నాలుగు పర్యాయాలు విజయం సాధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ ఓటమి చవిచూడడాన్ని ఆపార్టీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. తమకు గట్టి పట్టున్న ఓరుగల్లులో పార్టీ బలహీన పడుతుంటే అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టడం లేదనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు కీలక నేతలు కారు దిగేందుకు రెడీ అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. కొందరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ నేతలతో టచ్‌లోకి వెళ్లినట్టుగా సమాచారం.

పరాజయాలతో గులాబీ పరేషాన్

తెలంగాణ ఉద్యమంలో అండగా నిలిచిన పోరుగడ్డ ఓరుగల్లులో బీఆర్ఎస్‌కు వరుస ఓటములు మింగుడు పడటం లేదు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఎమ్మెల్యేలు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే విజయం సాధించారు. అంతేకాకుండా 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను గెలుచుకుని బలమైన పార్టీగా ఆవిర్భవించింది. నాటి పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నుంచి కీలకమైన నేతలు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికి చేరారు. లీడర్, కేడర్‌తో బలంగా ఉన్న బీఆర్ఎస్ 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీ చైర్మన్లతో పాటు మెజారిటీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలుచుకుని బలమైన శక్తి బీఆర్ఎస్ ఎదిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బలమైన రాజకీయ పక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కష్టకాలం మొదలైందనే చర్చ జరుగుతోంది. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో కేవలం జనగామ, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లోనే బీఆర్ఎస్ గెలిచింది. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. దీంతోపాటు పార్లమెంట్ ఎన్నికల వేళ స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కారు దిగి హస్తం గూటికి చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన కూతురిని కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దించి ఎంపీ గా గెలిపించుకున్నారు. కడియంతో పాటు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సైతం బీజేపీలోకి వెళ్లారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఎవరికివారు కాంగ్రెస్ లో చేరారు. వీరితో పాటు కీలక నేతలు చాలా మంది కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. ఈ నేపథ్యంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌ను బరిలో దించగా ఆయన మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఏ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ తన ప్రభావాన్ని చూపలేకపోయింది. పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో కొన్ని ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మిగతా ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగానే పోలింగ్ జరిగింది. బీఆర్ఎస్ మూడోస్థానానికి పరిమితం కావటంతో అప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఉన్న కేడర్‌కు మింగుడు పడకుండా తయారైంది. మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసిన మాలోతు కవితకు కూడా ఏ అసెంబ్లీ నియోకవర్గంలోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయారు. ఇక్కడ బీజేపీ బలంగా లేకపోవటంతో బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలవటం కొంత ఉపశమనంగా భావిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీల్లో ఒక్కటి కూడా గెలవకపోవడం కేడర్‌లో నిరాశను నింపింది.

పట్టభద్రుల ఝలక్‌తో మరింత కుదేలు..

గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాల్లోనూ ఎదురుదెబ్బలు తప్పటం లేదు. 2009 నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలిచిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పట్టు నిలుపుకోలేకపోయింది. తాజాగా జరిగిన ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఉద్యమ సమయంలోనే కాకుండా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ వైపు నిలిచిన పట్టభద్రులు కాంగ్రెస్, బీజేపీలకు అవకాశం లేకుండా చేశారు. నాలుగు సార్లు బీఆర్ఎస్ అభ్యర్థులకే పట్టం కట్టారు. అయితే గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లారాజేశ్వరరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ఈ సిట్టింగ్ స్థానంలో తిరిగి గెలవాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ఏనుగుల రాకేష్‌రెడ్డిని బరిలో దించింది. అయినప్పటికి రెండో ప్రాధాన్యత ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. దీంతో ఈ స్థానంలో తొలిసారి కాంగ్రెస్ పాగా వేసింది. కాగా, ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో ఉన్న గులాబీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటమి మరింత కుంగతీస్తోంది.

గులాబీ నేతల పక్కచూపులు..?

వరుస ఓటములతో రాజకీయ భవిష్యత్‌పై కొందరు నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్, బీజేపీల్లో చేరిపోయారు. చాలామంది నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై అభిమానం.. ఉద్యమం నుంచి వచ్చిన పార్టీ అన్న భావనతో కొనసాగుతున్నారు. కానీ తమ భవిష్యత్ దృష్ట్యా కొందరు పక్కచూపులు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్‌లో ఎంపీల ప్రమాణస్వీకారం తరువాత బీఆర్ఎస్ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఉమ్మడిజిల్లా ముఖ్యనేతలు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితోనే మంతనాలు చేస్తుండగా, మరికొందరు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పార్టీలో చేరే విషయమై చర్చలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని, ఇప్పటికే కేంద్రంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరనుండటం, రాష్ట్రంలో కాంగ్రెస్ వర్సెస్

మిగతా 6వ పేజీలో..

నేడే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

ఒక్క నిమిషం ఆలస్యమైతే అనుమతి లేదు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 8: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం నిర్వహించనుండటంతో జిల్లాలో ఏర్పాటు చేసిన 17కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. 9,092 మంది పరీక్ష రాసేందుకు కావాల్సిన వసతులు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. 17మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 25మంది పర్యవేక్షకులు, ఐదుగురు రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఉదయం 9నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారన్నారు. ఉద యం 10గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లో ఉన్న నిబంధనలు పాటించాలన్నారు. హాల్ టికెట్‌తోపాటు కలర్ ఫొటో, ఒరిజినల్ ఆధార్‌కార్డు లేదా డ్రైవిం గ్ లైసెన్సు, ఉద్యోగి గుర్తింపు కార్డు, ఓటరు గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకురావా లన్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో సరిగ్గా కనిపించకపోతే 3 కలర్ ఫొటోలతోపాటు హాల్‌టికెట్‌పై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించు కొని రావాల న్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 నుంచే 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నా రు. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులను బయటకు పం చేది లేదని, పరీక్ష ముగిసిన తర్వాత అభ్య ర్థులు ప్రశ్న పత్రాలను తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు.

కస్తూర్బాలో నాణ్యమైన విద్య

- బాలికల విద్యకు అండగా విద్యాలయాలు
- 6వ నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల విద్యాబోధన
- హాస్టల్ వసతితోపాటు మౌలిక వసతులు

వివరాలు : 8లో

లెక్కతేలిన పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్

వివరాలు: 7లో

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

- కక్షిదారులు చొరవ చూపాలి
- వరంగల్, హనుమకొడ జిల్లాల ప్రధాన న్యాయమూర్తుల పిలుపు
- జాతీయ లోక్ అదాలత్‌లో 6,971 కేసులు పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తులు

వరంగల్ లీగల్, జూన్ 8: జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారులు హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని, రాజీపడదగ్గ కక్షిదా రులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులో తెలియపరిచి రాజీకుదుర్చుకోవాలని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్లు బీవీ నిర్మలా గీతాంబ, బి.అపర్ణాదేవి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని న్యాయసేవాసదనంలో జాతీయ లోక్ అదాలత్‌ను వారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ మాట్లాడుతూ.. రాజీపడదగ్గ కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు హాజరై తమ కేసులు పరిష్కరించుకోవాలని కోరారు. కోర్టు చుట్టూ పలుమార్లు తిరగవలసిన పనిలేకుండా సుహృద్భావ వాతావరణంలో అప్పీలు లేని న్యాయబద్ధమైన అంతిమ తీర్పు పొందాలంటే లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణాదేవి మాట్లాడుతూ.. స్నేహపూర్తి వాతావ రణంలో ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన తీర్పు ద్వారా పరిష్కారం పొంది రాజీపడాలని కక్షిదారుల కు సూచించారు. వరంగల్ జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసుల్లో రాజీకుదుర్చుకో వడం వల్ల కక్షిదారులకే శుభదాయకమని తెలిపారు. డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. రాజీపడదగ్గ కేసుల లోకి కక్షిదారులు కోర్టు చుట్టూ తిరగకుండా జాతీయ లోక్ ఆదాలత్‌లో తమ కేసులను ఉపసంహరిం చుకోవాలని తెలిపారు.

ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వరంగల్ జిల్లాలో 7 బెంచీలను ఏర్పాటు చేసి మొత్తం 2,953 పెండింగ్ కేసులను పరిష్కరించారు ఇందులో సివిల్ కేసులు 57, ఎంవీవోపీ కేసులు 34 (రూ.2,60,90,000), క్రిమినల్ కేసులు 2,896, బ్యాంక్ పిఎల్‌సీ కేసులు 11 (రూ.14,15,514) బీఎస్ ఎన్ఎల్ కేసులు 34, ఎలక్ట్రిసిటీ పీఎల్‌సీ కేసులు 927 ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 10 బెంచీలను ఏర్పాటు చేసి మొత్తం 4,018 కేసులను పరిష్కరించారు. సివిల్ కేసులు 29, ఎంవీఓపీ కేసులు 28 (రూ.1,30,15,000) క్రిమినల్ కేసులు 3,989, బీఎస్ఎన్‌పీ ఎల్‌సీ కేసులు 1 బ్యాంక్ పిఎల్‌సీ కేసులు 9 (రూ.19,27,600) ఉన్నాయి. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కేసులను పరిష్కరించేందుకు జిల్లా వ్యాప్తంగా వరంగల్ జిల్లాలో 6, నర్సంపేటలో 1, బెంచీలను, హనుమకొండ జిల్లాలో 9, పరకాలలో 1 బెంచీలను ఏర్పాటు చేశారు. జాతీయ లోక్‌అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లను అందించారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడంలో సహకరించినవారికి న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు జి.ప్రేమ లత, వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె. ఉపేందర్‌రావు, ఇతర న్యాయ మూర్తులు, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తీగల జగన్ గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ఈసీ మెంబర్ బి.జయాకర్, ఇతర న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లు, వివిధ బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.


వరంగల్ స్టేషన్‌రోడ్‌లో సీడ్స్ కొంటున్న రైతులు(ఫైల్)

బ్లాక్ దందా

అధికారుల అండ

- నకిలీ విత్తనాల విక్రయాల జోరు
- యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు..
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయం..
- పీడీ యాక్ట్, లైసెన్ రద్దు కాని వైనం..
- మామూళ్ల మత్తులో అధికారులు
- జిల్లాలో పేట్రేగిపోతున్న అక్రమార్కులు

వరంగల్ వ్యవసాయం, జూన్ 8: విత్తనాల దందా జోరుగా సాగుతోంది.. వారికి అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో కల్తీ విత్తన, బ్లాక్ దందా చేసేవాళ్ల చెలరేగిపోతున్నారు. బ్లాక్ దందాపై పోలీసులు అడపాదడపాలు దాడులు చేయడం.. కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటుండడంతో అక్రమదారులు పేట్రేగిపోతున్నారు. మే, జూన్, జూలై నెలల్లో విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించడం, రైతులకు కల్తీ విత్తనాలను అంటగడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ ప్రకటనలు చేయడం తప్ప చేసిందేమీ లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు కనీసం అక్రమార్కుల లైసెన్సులు రద్దు చేసిందా..? క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపించిందా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. గత ఐదేళ్లలో జైలు శిక్ష, పీడీ యాక్టు కింద కేసు, లైసెన్సులు రద్దు చేసిన దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు.

దొరికేవి కొన్ని... దొరకనివి ఎన్నో..

ఇటీవల వ్యవసాయ, టాస్క్‌ఫోర్స్ అధికారులు విత్తన షాపులపై దాడులు చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఐదు ఘటనలలో సుమారు రూ.15 లక్షల విలువైన విత్తనాలు, గడ్డి మందులను పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కూడా విత్తన దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. దొరికిన వారు కొద్దిమందే కానీ.. దొరకనివారు ఎందరో. ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మినా, బిల్ మాత్రం ఎంఆర్‌పీకే నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో దుకాణాల్లోని రిజిస్టర్లు పక్కాగా రూపొందించి, అధికారులను అక్రమార్కులు తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అవగాహన కల్పించడంలో విఫలం

రైతులు దుక్కులు దున్నడం నుంచి మొదలు పెడితే విత్తనం పెట్టి, పంట చేతికి వచ్చే వరకు ఎప్పుడు ఎప్పుడు ఎలా చేయాలి, ఎందుకు చేయాలి, పంట దిగుబడి

మిగతా 8వ పేజీలో..

ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- రూ.50లక్షల సరుకు స్వాధీనం

వరంగల్ క్రైం, జూన్ 8: భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠాను టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు కలిసి అరెస్టు చేశారు. అలాగే రూ.50 లక్షల విలువ కలిగిన 192 కిలోల గంజాయితో పాటు ఒక కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో డబ్బాల జంక్షన్ వద్ద నివాసం ఉంటున్న గజ్జి సహదేవ్, మహారాష్ట్రకు చెందిన యోగేశ్వర్, రాందాస్ ఉన్నారు. ఒరిస్సాకు చెందిన పాండు, లక్ష్మీతాటే, మహారాష్ట్రకు చెందిన వికాస్ పరారీలో ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శనివారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు.

నగరంలోని డబ్బాల జంక్షన్ వద్ద నివాసం ఉంటున్న గజ్జి సహదేవ్ కారు డ్రైవర్‌గా చేస్తుంటాడు. ఇతడికి మిగతా నిందితులతో పరిచయం ఏర్పడింది. సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో కొద్దిరోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు మండలం తునగొండ గ్రామ పరిసరాల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే క్రమంలో 192 కిలోల గంజాయి కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున 96 ప్యాకెట్లు చేసి చింతూరు నుంచి ములుగు జిల్లా ఏటూరునాగారం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో శనివారం దామెర సమీపంలోని శ్రీహర్ష స్కూల్ వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన గజ్జి సహదేవ్‌పై గతంలో పరకాల, హనుమకొండ పోలీస్‌స్టేషన్లలో గంజాయి స్మగ్లింగ్ కేసులున్నాయి. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐలు రాజు, రవికుమార్, ఎస్ఐలు నిస్సార్ పాషా, శరత్‌కుమార్, దామెర ఎస్ఐ అశోక్, ఏఏవో సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్ల సురేష్, శ్రీనివాస్, అఫ్జల్‌ఖాన్, సతీష్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.


గంజాయి పట్టుకున్న పోలీస్ సిబ్బందితో కమిషనర్

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటక పోటీలు

వరంగల్‌కల్చరల్, జూన్ 8: రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 15వ రాష్ట్ర తెలుగు నాటక పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్‌లోని పోతన విజ్ఞానపీఠంలో మూడు రోజులు పాటు కొనసాగే ఈ పోటీలను రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ప్రారంభం చేయనున్నారు. ప్రారంభ సమయంలో పలువురు ప్రముఖులు వరంగల్ జి ల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదికతోపాటు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో మూడు రోజుల పాటు నాటక ప్రదర్శనలు జరుగుతాయని అధ్యక్షులు కాజీపేట తిరుమలయ్య, కార్యదర్శి ఎస్ఎస్ఆర్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి ఇంజనీరింగ్ కళాశాలల్లో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన ఈసెట్-2024 కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని వరంగల్ జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ డాక్టర్ భైరి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు వారి వారి సమయానుసారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

'గులాబీ'కి మరో దెబ్బ!

(5వ పేజీ తరువాయి)

బీజేపీ అన్నట్టుగా రాజకీయాలు మారబోతున్నాయన్న అంచనాల నడుమ బీజేపీలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో పలువురు హైదరాబాద్‌లో కాషాయ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. వచ్చే 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతందని, రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య 119 నుంచి 175కు పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ముందుగానే గోడ దూకి అసెంబ్లీ సీటుపై కర్ఛీఫ్ వేసుకోవాలనే ఆలోచనలో కొందరు గులాబీ నేతలు పక్కచూపులు చూస్తున్నారనే చర్చ జరుగుతోంది. మొత్తానికి వరుస ఓటములు గులాబీ పార్టీకి కష్టకాలాన్నితెచ్చి పెట్టాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. ఈ కష్టకాలం నుంచి గట్టెక్కేందుకు గులాబీ బాస్ ఎలాంటి అడుగులు వేస్తారనేది ఓరుగల్లు రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

గృహిణి అదృశ్యం

వరంగల్ క్రైం, జూన్ 8: కూతురితో కలిసి మాధవి అనే గృహిణి అదృశ్యమైన సంఘటన కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లో పెద్దకాసు శ్రీశైలం, మాధవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల కూతురు ఉంది. ఈనెల 6వ తేదీన మాధవి(26) తన కూతురుతో కలిసి ఇంట్లో సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో రెండు రోజుల పాటు వెతికిన శ్రీశైలం.. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రతీ సారి ఇదే తంతు

దొరికితేనే బయటపడుతున్న దొంగలు ● మూల్యాంకనంలో కొరవడిన నిఘా
అక్రమార్కులకు అందివస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8 : కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్న ప్రతీసారి జవాబు పత్రాలు బయటకు వెళుతున్నట్లు వర్సిటీ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ జరుగుతున్నప్పుడు నిఘా కొరవడుతుండటంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ క్యాంపులోకి ప్రైవేటు వ్యక్తులను దినసరి కూలీలను తీసుకుంటున్న కేయూ అధికారులు.. వారిపై పర్యవేక్షణ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతోనే వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. స్పాట్ క్యాంపులకు 25 మంది డెయిలీ వేజెస్ కింద నియమించుకుంటున్నారు. కోడింగ్ జరుగుతున్న క్రమంలో వారు పేపర్ బండిళ్లలోని పేపర్లను మాయం చేస్తూ బయటకు పంపిస్తున్నారు.

ఇందుకు ఒక్కో పేపర్‌కు రూ.5వేల నుంచి 10వేలు వసూల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిని అధికారులు గుర్తిస్తే తప్ప దొంగలు బయటపడటం లేదు. ప్రతీసారి స్పాట్ క్యాంపు నుంచి జవాబు పత్రాలు బయటకు తీసుకెళుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారుల తోడ్పాటు లేకుండా జవాబు పత్రాలు బయటకు ఎలా వెళ్లుతాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. పూర్తి స్థాయిలో విచారణ చేస్తేనే అసలు నిజాలు బయట పడుతాయనే అభిప్రాయాలను వర్సిటీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నిఘా వైఫల్యం.. పర్యవేక్షణ శూన్యం..

పరీక్షల విభాగంలోని స్పాట్ క్యాంప్‌ల్లో అధికారుల నిఘా వైఫల్యంతోనే తరుచూ జవాబు పత్రాలు బయటకు వెళుతున్నాయి. దినసరి వేతనం కింద నియమిస్తున్న ప్రైవేటు వ్యక్తులపై అధికారుల పర్యవేక్షణ శూన్యం కావడంతో వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. స్పాట్ క్యాంపుల్లో 25 మంది వరకు ప్రైవేటు వ్యక్తులు పనులు చేస్తున్నారు. వీరంతా రోజుకు రూ.260 చొప్పున పనిచేస్తున్నారు. కోడింగ్ సమయాల్లో వీరిపై నిఘా కొరవడటంతో జవాబు పత్రాల బండిళ్లు తీస్తున్నప్పుడు వాటిల్లో నుంచి ముందుగా ఒప్పందం కుదుర్చుకున్న విద్యార్థులకు సంబంధించిన జవాబు పత్రాలను తీసుకెళ్లి వారికి అందజేస్తున్నారు. వారు మళ్లీ జవాబులు రాసేందుకు అడిషనల్ పేపర్లు ఇచ్చి వారితో రాయించి ఆ పేపర్లను తిరిగి బండిళ్లలో సర్దుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులకు మాత్రం కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నిఘా నేత్రానికి దొరికితేనే దొంగలు

సీసీ కెమెరాల ఫుటేజీలో చూస్తేనే తప్ప.. దొంగలు బయట పడటం లేదు. నిరంతరం నిఘా ఉంచాల్సిన జవాబు పత్రాలు బయటకు వెళుతుంటే అధికారులకు మాత్రం కనిపించడం లేదు. రెగ్యులర్ ఉద్యోగుల భద్రతలో ఉండాల్సిన విద్యార్థుల భవితవ్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పరిహాసం అవుతున్నా అధికారులు తూతూ మంత్రపు చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు బయట పడినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప.. అసలు సంఘటనలు జరుగకుండా పూర్తి స్థాయి భద్రత చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిఘా వైఫ్యలం, పర్యవేక్షణ కొరవడటంతోనే అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ డబ్బులు దండుకుంటున్న వారిపై నామమాత్రపు చర్యలే తీసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

11 మంది.. 25 పేపర్లు..

కేయూలో జరిగిన సంఘటనలో మొత్తం 25 జవాబు పత్రాలు మార్పిడీ జరిగినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు.. మరో 8 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారిపై కేసు నమోదు చేశారు.

లెక్కతేలిన పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్

1,098 ఎల్పీ పోస్టులు, 265 పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో చేపడుతున్న భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ లెక్క తేలింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,231 భాషా పండితుల పోస్టులు ఉండగా, అందులో 1,098 పోస్టులు స్కూల్ అసిస్టెంట్(భాష) పోస్టులుగా ఉన్నతీకరణ కానున్నాయి. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 321 పీఈటీ పోస్టులు ఉండగా, అందులో 265 పోస్టులు పీడీలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,363 పోస్టులు అప్‌గ్రేడ్ కానున్నట్లు విద్యాశాఖ వివరాలు వెల్లడించింది.

తెలుగు భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	128	114
హనుమకొండ	103	92
జనగామ	115	102
జయశంకర్ భూపాలపల్లి	75	67
మహబూబాబాద్	149	133
ములుగు	57	51

హిందీ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	119	106
హనుమకొండ	108	96
జనగామ	111	99
జయశంకర్ భూపాలపల్లి	76	68
మహబూబాబాద్	126	112
ములుగు	57	51

ఉర్దూ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	2	2
హనుమకొండ	4	4
జనగామ	1	1

పీఈటీ అప్‌గ్రేడేషన్ ఇలా...

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	72	59
హనుమకొండ	74	61
జయశంకర్ భూపాలపల్లి	37	31
జనగామ	58	48
మహబూబాబాద్	58	48
ములుగు	22	18

కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలను తాత్కాలింగా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలను తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో తర్వాత ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.





రాంపురం వద్ద కాకతీయ కెనాల్ పక్కన చనిపోయిన కోళ్లను పడేస్తున్న దృశ్యం

రోడ్ల వెంట కోళ్ల కళేబరాలు

గీసుగొండ, జూన్ 8: కోళ్లఫాం నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో ఫాం సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోళ్లఫాంలో మృతిచెందిన కోళ్లను గుంతతీసి పాతిపెట్టి ఉప్పులాంటి వాటిని చల్లి పూడ్చాల్సి ఉండగా, చనిపోయిన కోళ్లను కాకతీయ కెనాల్ పక్కన, రోడ్ల పక్కన వాహనాల్లో తీసుకువచ్చి పడేస్తుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యజమానులు కనీస నిబంధనలు పాటించడం లేదని మండిపడుతున్నారు. కొన్ని కోళ్ల ఫాంలకు పర్యావరణ శాఖ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అనుమతులు లేవని ఆరోపిస్తున్నారు.



బాణాసంచా కాల్చుతున్న నేతలు

ఎమ్మెల్సీ గెలుపుతో కాంగ్రెస్ సంబరాలు

సంగెం, జూన్ 8: ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్‌మల్లన్న గెలుపొందడంతో శనివారం సంగెంలో కాంగ్రెస్ నేతలు బాణా సంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుగా శాసన మండలిలోకి అడుగు పెడుతున్న మల్లన్నకు పార్టీ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగపాటి రాజుగౌడ్, గవిచర్ల ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, నాయకులు కందకట్ల నరహరి, కిషోర్‌కుమార్, కోటేశ్వర్, గూడ కుమారస్వామి, రాజశేఖర్, జగన్నాథచారి పాల్గొన్నారు.

రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

ఏనుమాముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ మల్లేశం

వరంగల్‌సిటీ, జూన్ 8: మార్కెట్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, ఏనుమాముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ మల్లేశం అధికారులను ఆదేశించారు. ఏనుమాముల మార్కెట్లో మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి అధ్యక్షతన మార్కెట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో క్రయవిక్రయాలు తక్కువగా ఉండడంతో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతీరోజు యార్డుల క్లీనింగ్, సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రేడ్2 కార్యదర్శి రాము, అకౌంటెంట్ రాజ్‌కుమార్, రాజేందర్, శివ పాల్గొన్నారు.

కస్తూర్బాలో నాణ్యమైన విద్య

• బాలికల విద్యకు అండగా విద్యాలయాలు
• 6 నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల విద్యాబోధన
• హాస్టల్ వసతితోపాటు మౌలిక వసతులు

గీసుగొండ, జూన్ 8: సమగ్ర శిక్షాభియాన్(ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా బాలికా విద్యాలయ(కేజీబీవీ)లు బాలికలకు వరంగా మారాయి. 6వ తరగతిలో అడ్మిషన్ పొందితే ఇంటర్ వరకు చదువుకోవచ్చు. ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉన్న ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును కూడా అందిస్తున్నారు. యోగా, కరాటే వంటి వాటిని కూడా నేర్పిస్తారు. అనాథల పిల్లలు, ఆర్థిక పరిస్థితులతో మధ్యలో బడిమానేసిన పిల్లలు, చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి కేజీబీవీలో తొలి ప్రాధాన్యమిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున పదేళ్ల క్రితం ఈ విద్యాలయాలను అందుబాటులోకి తెచ్చారు. మొదట తెలుగు మీడియం ఉండగా, తర్వాత ఇంగ్లీష్ మీడియంగా మార్చారు. ప్రస్తుతం 6వ తరగతిలో అడ్మిషన్లను తీసుకుంటున్నారు. మొదట్లో 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే విద్యాలయాల్లో బోధన ఉండేది. తర్వాత ఇంటర్, వొకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టారు. అధునాతన వసతులతో డిజిటల్ క్లాస్‌రూంలు, ల్యాబ్‌లు, డైనింగ్ హాల్, యూరినల్స్, మరుగుదొడ్లు, డార్మెట్రీ ఉండే విధంగా మూడంతస్తులతో నూతన భవనాలను ప్రభుత్వం నిర్మించింది. ఈ విద్యానిలయాలు పూర్తిగా సీసీ కెమెరాల నిఘా లో కొనసాగుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయి.



బాలికలచే తయారైన చేతినైపుణ్య వస్తువులు

జిల్లాలో 10 కస్తూర్బా విద్యాయాలు..

జిల్లాలో 10 కస్తూర్బా బాలిక విద్యాలయాలు ఉన్నాయి. గీసుగొండ, సంగెం, రాయపర్తి, పర్వతగిరి, నల్లబెల్లి, చెన్నారావుపేట, వర్ధన్నపేట, ఖానాపురం, దుగ్గొండి, నెక్కొండ మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. 6నుంచి 10వ తరగతి వరకు ఒక్కో క్లాస్‌లో 40మంది చొప్పున పాఠశాలలో 200 మంది చదువుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 2000 మంది విద్యనభ్యసించే అవకాశం ఉంది. ప్రతీ సంవత్సరం మే నుంచే 6వ తరగతి, మిగిలిన తరగతుల్లో ఖాళీ అయిన సీట్లలో అడ్మిషన్లు తీసుకుంటారు. ఇంటర్‌లో ప్రవేశాలకు గీసుగొండ, నల్లబెల్లి, చెన్నారావుపేట, సంగెం కస్తూర్బా విద్యాలయాల్లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు తెలుగుమీడియంలో అందిస్తుండగా, వర్ధన్నపేట, ఖానాపూర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ఇంగ్లీష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయి.

సీఆర్టీ, పీజీసీఆర్టీలచే ఉత్తమ బోధన

కేజీబీవీలలో బీఈడీ, ఎంఈడీ చేసిన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్(సీఆర్టీ)లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెన్షియ్ టీచర్(పీజీసీఆర్టీ)లు విద్యాబోధన చేస్తారు. క్రాఫ్ట్ టీచర్‌లు కూడా అందుబాటులో ఉండి చేతి నైపుణ్యాలను నేర్పిస్తారు. యోగా, మార్షల్ ఆర్ట్స్, నృత్యాలు, చిత్రలేఖనం వంటి వాటిల్లో కూడా శిక్షణ ఇస్తారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే ప్రాథమిక చికిత్స చేసేందుకు ఏఎన్ఎం ఇందులో ఉంటారు. ప్రతీ రోజు ముగ్గురు టీచర్లు నైట్ డ్యూటీలో ఉంటారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో పాటు ఉచితంగా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, దుప్పట్లు, కాస్మొటిక్ కిట్‌లు అందిస్తారు.



యోగా చేస్తున్న విద్యార్థినులు

బాలికలకు బంగారు భవిష్యత్



చదవాలనే ఆసక్తి ఉన్న బాలికలకు కేజీబీవీలు బంగారు భవిష్యత్‌ను ఇస్తాయి. అనాథ పిల్లలకు, బడిమానేసిన, ఆర్థికంగా వెనుకబడిన బాలికలకు ఇదొక వరం. నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్య రక్షణ, పౌష్టికహారం ప్రభుత్వం అందిస్తోంది.

-ఫ్లోరెన్స్, ఎస్ఎస్ఏ జిల్లా బాలికల సెక్టోరియల్ అధికారిణి

కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించిన ప్రజలు

కరీమాబాద్, జూన్ 8: ప్రధాని మోదీ ప్రభుత్వ బ్రాహ్మణీయ, ఫాసిస్ట్, కార్పొరేటీకరణ విధానాలను దేశ ప్రజలు వ్యతిరేకించారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్ అన్నారు. శనివారం 39వ డివిజన్ విద్యానగర్‌లోని కార్యాలయంలో న్యూడె మోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దయాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థను కూడా రద్దుచేసి అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థను తీసుకురావడానికి చేసిన కుట్రలు ఫలించలేదన్నారు. ఈడీ, ఐటీ, సీబీఐ తదితర సంస్థలను అడ్డుపెట్టుకొని తనను ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీ నాయకులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రభుత్వాలను పడగొట్టడం పార్టీలను చీల్చడం చేసిందని అన్నారు. పౌరసత్వ సవరణ చట్టం ఆర్టికర్ 370ని రద్దు చేయడం, రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని పోరాడుతున్న రైతాంగంపై ఉక్కుపాదం మోపడం లాంటి ప్రజావ్యతిరేక విధానాలను అనుసరించిందన్నారు. సమావేశంలో న్యూడెమోక్రసి జిల్లా నాయాకులు బండి కోటేశ్వర్‌రావు, ఎలకంటి రాజేందర్, ప్రజా సంఘాల నాయకులు గట్టు కృష్ణ, రంజిత్ కుమార్, ఐనుముల కృష్ణ, ప్రభాకర్, తిరుపతి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంగుల దయాకర్

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

శంభునిపేట, జూన్ 8: మానవ అక్రమ రవాణాను అరికట్టడం సామాజిక బాధ్యతని ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి ఖిలావరంగల్ మండల అధ్యక్షుడు ఈసంపల్లి సుదర్శన్ తెలిపారు. ఎఫ్ఎంఎం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, రొటీన్ ఇమ్యూనైజేషన్ అంశాలపై ఖిలావరంగల్ మండలం నక్కలపల్లిలోని ఉప ఆరోగ్య కేంద్రంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ మౌనిక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఈసంపల్లి సుదర్శన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలకార్మికులు, లింగనిర్ధారణ పరీక్షలు, లైంగిక వేధింపులు, సమానత్వం, ఆడపిల్లల సంరక్షణ వారి హక్కులపై ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు. హెల్త్‌వర్కర్‌లు, ఆశాలు, అంగన్‌వాడీలతోపాటు తల్లిదండ్రులు బాధ్యతను తీసుకోవాలన్నారు. క్షయ, ధనుర్వాతం, గోరింతదగ్గు, కామెర్లు, డిప్తీరియా, న్యూమోనియా, పోలియో, రేచీకటి, డిటానస్ లాంటి వ్యాధులు వ్యాపించకుండా పిల్లలందరికీ సకాలంలో వ్యాక్సినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం షిభారాణి, అనిత, ఆశాలు పద్మ, శ్రీలత, శోభ, సునీత, ఎలిబజెత్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య బృందం

రామోజీకి నివాళి

మిల్స్‌కాలనీ, జూన్ 8: ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావుకు ఆయన అభిమానులు శనివారం నివాళులర్పించారు. హైదరాబాద్‌లో రామోజీరావు మరణించడం తో శివనగర్‌లో ముత్తినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేష్ ఉపాధ్యాయ, కృష్ణ, సత్యం, రమేష్, ఓదెలు, భరత్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్‌సిటీ: కాంగ్రెస్ 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్‌లో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కొమ్ముల సందీప్, కుసుమ సతీష్, నీలం శ్రీనివాస్, మక్బూల్, అవినాష్, నాగరాజు, హరిప్రసాద్, శేషు పాల్గొన్నారు.



కాశిబుగ్గ జంక్షన్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉచిత కోచింగ్ అధ్యాపకులకు సన్మానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: కాకతీయ విశ్వవిద్యాలయం లో పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌లో ఉచితంగా బోధించిన అధ్యాపకులను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సన్మానించారు. శనివారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ పేద ఉద్యోగార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫ్రీ కోచింగ్ సెంటర్‌లో బోధించి వారికి తోడ్పాటు అందించిన అధ్యాపకులను సన్మానిస్తూ వారిని అభినందించారు. అధ్యాపకులు కె. మధు, గోలి ప్రశాంత్‌రెడ్డి, యాకన్న, లక్ష్మణ్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ శంకర్, డాక్టర్ వీరస్వామి తదితరులను రిజిస్ట్రార్ సత్కరించారు.

రామా శ్రీనివాస్ జయంతి వేడుకలు

వరంగల్ కల్చరల్, జూన్ 8: మోక్షారామం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సంఘ సేవకులు, సామాజికవేత్త దివంగత రామా శ్రీనివాస్ 60వ జయంతి వేడుకలను రామన్నపేటలో ఘనంగా జరిగాయి. శనివారం రామన్నపేటలోని మోక్షారామం ఫౌండేషన్ అమ్మఒడి భవనంలో శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎంజీఎంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాసాని చంద్రప్రకాశ్, కూరపాటి సుదర్శన్, దాసరి ప్రేమ్‌సాగర్, చందా మల్లయ్య, వలుస సుధీర్, చిప్ప వెంకటేశ్వర్లు, బేతి అశోక్, బిట్ల సమ్మయ్య, వడిచర్ల భాస్కర్, వడిచర్ల ప్రసాద్, రామ్మూర్తి, మోహన్, సురేష్, రాజు, అనిల్ పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బిక్కోజీనాయక్‌తండాలో వైద్య శిబిరం

సంగెం, జూన్ 8: బిక్కోజీనాయక్‌తండాలో హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేటి పాపిరెడ్డి, వైద్యులు కిషన్, మదన్‌మోహన్‌రావు బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌నాయక్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎల్లగౌడ్‌కు నివాళి

సంగెం, జూన్ 8: ఎంసీపీఐ నేత నారగోని ఎల్లగౌడ్ ఆశయాలను కొనసాగిస్తామని ఎంసీపీఐ నేతలు చెప్పారు. శనివారం ఎల్గూరు రంగంపేటలో ఏర్పాటు చేసిన సంతాప సభలో నివాళులర్పించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనే కుమారస్వామి మాట్లాడుతూ మండలంలో పేదల పక్షాన పోరాటం చేసిన ఘనత ఎల్లగౌడ్‌కు దక్కిందన్నారు. ఐక్య ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల సాధన కోసం పార్టీ చేపట్టిన ఉద్యమంలో వృద్ధాప్యంలోనూ పోరాడన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు పాల్గొన్నారు.

బ్లాక్ దందా.. అధికారుల అండ..

(5వ పేజీ తరువాయి)

తగ్గించేందుకు ఏం చేయాలన్న పూర్తి సమాచారం రైతులకు అందించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులదే. పత్తి విత్తనాల రకాలు వేరైనా అన్ని ఇంచుమించు ఒకే విధమైన దిగుబడిని ఇస్తాయని చెబుతున్నారనీ విషయంలో రైతుల్ని చైతన్యపర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. వ్యవసాయశాఖలో కొందరు అధికారులు ఏళ్ల నుంచి పాతుకుపోయారు. దీంతో అక్రమార్కులతో సన్నిహితంగా ఉంటూ దందాకు తమవంతు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతపంటలే ప్రమాణికం..

ఏటా వ్యవసాయశాఖ పంట ప్రణాళిక రూపొందించి వాటికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి. కానీ ఈసారి జిల్లాలో 2023లో పంట ప్రణాళికనే 2024 పంట ప్రణాళికగా వ్యవసాయ అధికారులు ప్రకటించారు. గత ఏడాదిలో ఏ పంట ఎక్కువగా సాగు చేశారు.. ఏది అధిక దిగుబడి వచ్చింది.. ఏది ధర పలికింది.. తదితర అంశాలపై ఎలాంటి ప్రణాళిక లేకుండానే ప్రకటించడంపై రైతులు సంఘాలు మండిపడుతున్నాయి.

చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి

చట్టాలను కచ్చితంగా అమలు చేస్తేనే రైతులు మేలు జరుగుతుంది. సాగు మొదలు పంట చేతికి వచ్చి మార్కెట్లో అమ్ముకునేంత వరకు రైతులక అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. కల్తీ విత్తనాలు, అధిక ధరలకు అమ్మినా పీడీ యాక్టు కింద కేసులు అంటున్నారు. ఇప్పటి వరకు ఒక్కకేసు నమోదైన దాఖలాలు లేవు. అక్రమార్కులకు కొందరు అధికారులు మామూళ్లకు అలవాటుపడి వత్తాసు పలుకుతున్నారు.

- మోర్తాల చందర్‌రావు, తెలంగాణ రైతు సంఘం కన్వీనర్

వ్యాపారంలో మిత్రుడు మోసం చేశాడని..

గుండెపోటుతో వ్యక్తి మృతి.. బాధితుల ఆందోళన

కమలాపూర్, జూన్ 8: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసం చేశాడని ఓ వ్యక్తి మనోవేదనకు గురై గుండెపోటుతో మరణించాడని మృతుడి కుటుంబ సభ్యులు మిత్రుడి ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన శనివారం మండలంలోని శ్రీరాములపల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... హసన్‌పర్తి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన సూదుల సాంబరెడ్డి(58), శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన తాటిపాముల శేఖర్‌తో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. భూములు కొని వెంచర్లుగా ఏర్పాటు చేసి వ్యాపారం చేశారు. వ్యాపారంలో ఆర్థిక లావాదేవీల్లో తేడా రావడంతో పలుమార్లు పంచాయితీ పెట్టి పెద్దమనుషుల సమక్షంలో 2013లో సాంబరెడ్డికి రూ.65 లక్షలతో పాటు, 2980 గజాల భూమి, హసన్‌పర్తి మంత్రపురి కాలనీలో ఒక ఇల్లును ఇవ్వాలని తీర్మానం చేశారు.



సాంబరెడ్డి(ఫైల్)

అప్పటి నుంచి ఎన్నిసార్లు అడిగినా కూడా స్పందించకుండా డబ్బులు, భూమి, ఇల్లు ఇవ్వకుండా శేఖర్ ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో మనస్తాపానికి గురైన సాంబరెడ్డి గుండెపోటుతో మరణించాడు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వ్యాపారంలో భాగస్వామి అయిన తాటిపాముల శేఖర్ ఇంటి ముందు మృతదేహంతో ఆందోళనకు దిగినట్లు మృతుడి కుమారుడు భరత్ చెప్పారు. సమాచారం తెలుసుకున్న సీఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ సురేష్, పెద్దమనుషులతో మాట్లాడి ఆందోళన విరమింపచేసినట్లు తెలిపారు.

సంవృద్ధిగా తాగునీరు

ఖిలావరంగల్, జూన్ 8: నగరంలోని 18, 27వ, డివిజన్లకు తాగునీరు సంవృద్ధిగా సరఫరా జరుగుతుందని కార్పొరేటర్ వస్కుల బాబు అన్నారు. శనివారం 18వ, డివిజన్ ఎస్ఆర్‌టీ కాలనీలో వాటర్‌ట్యాంక్‌కు విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ చొరవతో రూ.35లక్షలతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేశారన్నారు. దీంతో నగరంలోని వాటర్‌ట్యాంక్ ద్వారా లేబర్‌కాలనీ, క్రిస్టియన్‌కాలనీ, ప్రతాప్‌నగర్, చెన్నారెడ్డికాలనీ, శాలినీనగర్, గాంధీనగర్, లేబర్‌కాలనీ, టీఆర్‌టీ, అబ్బనికుంట తదితర ప్రాంతాలకు తాగునీరు సంవృద్ధిగా అందుతుందన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఏఈ సౌజన్య, నగరపాలక సంస్థ, విద్యుత్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు జన్ను వివేక్, కాంగ్రెస్ పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, జూన్ 8: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడిపిన వాహనాదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి శనివారం జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 11 మంది వాహనాదారులకు రూ. 9700, మద్యం తాగి వాహనం నడిపిన 22 మంది వాహనాదారులకు రూ. 13,300జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

నెంబరు ప్లేట్ లేకుండానే..

• నగరంలో విచ్చలవిడిగా రోడ్లపైకి వాహనాలు • నెలల తరబడి తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తోనే..
• లైసెన్స్ లేకుండానే డ్రైవింగ్.. • ప్రమాద సమయంలో నష్టపోతున్న బాధితులు

మట్టెవాడ, జూన్ 8: నగరంలో వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. కొత్త వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత రవాణా శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో అలసత్వం వహిస్తున్నారు. వాహనం కొనుగోలు చేసే సమయంలో షోరూం అందించిన తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్‌తో నెలలు, సంవత్సరాలుగా వాహనాలు నడుపుతున్నారు. మరికొందరు నెంబర్ ప్లేట్‌ల పైన నెంబర్‌కు బదులు పేర్ల స్టిక్కర్లు, సినిమా హీరో స్టిక్కర్లు, ఇతర స్టిక్కర్లను అతికించుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్ సక్రమంగా రాయకపోవడం, నెంబర్ ప్లేట్‌పై ఇష్టానుసారంగా రాయడం, నెంబర్ సరిగా కన్పించకుండా దానిని తూడ్చి వేయడం వంటివి నేరం కిందికే వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నా వాహనదారులు నిర్లక్ష్యం వీడడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వాహనానికి నెంబర్ లేకపోవడంతో వాహనాన్ని గుర్తించడం కష్టంగా మారుతోంది. దీంతో ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో ఇబ్బందిగా మారుతోంది. పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌లేని వాహనాలు దొంగిలించినా నష్టపరిహారం చెల్లింపులు జరగదు. అంతేకాకుండా కేసు కూడా నమోదు చేయరు. నిబంధనల ప్రకారం రవాణా శాఖ అధికారుల తనిఖీలు, పోలీసుల తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని వాహనం పట్టుబడితే భారీ జరిమానా విధించడంతోపాటు వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేస్తారు.

నిబంధనలు పాటించాలి



ప్రతీ ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. కొత్త వాహనాలు నెలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రవాణశాఖ కేటాయించిన నెంబర్ ప్లేట్‌ను బిగించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే వాహన తనిఖీ సమయంలో సీజ్ చేయడమేకాక భారీగా జరిమానాలు విధిస్తాం. నెంబర్ ప్లేట్‌లో ఎటువంటి రాతలు ఉండకూడదు. ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా బిగించుకోవాలి. లేదంటే న్యాయపరమైన చిక్కులు తప్పవు.

-శ్రీధర్, వరంగల్ ట్రాఫిక్ సీఐ

రిజిస్ట్రేషన్, లైసెన్స్ లేకుండానే..

నగరంలో చాలా మంది వాహనదారులు రిజిస్ట్రేషన్ చేయించకుండా, మరికొందరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే రోడ్లపైకి వస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత కచ్చితంగా శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వరంగల్ ట్రాఫిక్ పోలీసులకు ఏడాది దాటినా తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తోనే నడుపుతున్న వాహన యజమానికి జరిమానా కూడా విధించారు. ఇది మచ్చుకు మాత్రమేనని ట్రాఫిక్ పోలీసులకు చిక్కకుండా ఎంతోమంది యాజమానులు తప్పించుకు తిరుగుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు.



నెంబర్‌లేని, నెంబర్ ప్లేట్‌లు లేని ద్విచక్రవాహనం

19వ డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రంజిత్



నియామకపు పత్రాన్ని అందుకుంటున్న రంజిత్

వరంగల్ సిటీ, జూన్ 8: అఖిల భారత పద్మశాలి సంఘం 19వ డివిజన్ డివిజన్ అధ్యక్షుడిగా క్యాతం రంజిత్ నియమితులయ్యారు. శనివారం వివేకానందకాలనీలో సంఘం వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ వడ్నాల నరేందర్ నియామక పత్రాన్ని రంజిత్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొద్దుల కుమార్, గూడూరు కృష్ణ, వంగరి రాంప్రసాద్, వేముల నాగరాజు, కూరపాటి మహేష్, సురేష్, కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

ఉబ్బస నివారణ మందు పంపిణీ

మట్టెవాడ, జూన్ 8: మృగశిర కార్తె ఉబ్బస నివారణకు ఆయుర్వేద మందును ఉచితంగా పంపిణీ చేసినట్లు దేవరకొండ జ్ఞానేశ్వర్, డాక్టర్ దేవరకొండ ధన్వంతరిలు తెలిపారు. శనివారం మృగశిర కార్తె సందర్భంగా బట్టలబజార్‌లో ఉబ్బస నివారణ ఆయుర్వేద మందును వారు పంపిణీ చేశారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 9 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

గొల్ల కురుమలకు న్యాయం చేయాలి

వర్ధన్నపేట రూరల్, జూన్ 8 : మండలంలోని వంద లాది మంది గొల్ల కురుమలు గత రెండు సంవత్సరాల క్రితం గత ప్రభుత్వం గొల్ల కురుమలకు సబ్సిడీ కింద గొర్రెలు అందిస్తామని చెప్పి ప్రభుత్వ ఖాతాలో జమ చేసుకుని వేచి చూస్తున్నారని వారిని ప్రభుత్వం ఆదుకో వాలని బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి డిమాండ్‌చేశారు. మండలంలోని కట్ర్యాలలో ఆయన శనివారం మాట్లాడుతూ అప్పులు తెచ్చి డీడీలు తీసి ప్రభుత్వ ఖాతాలో వేస్తే ఇప్పటి వరకు గొర్లు ఇవ్వలేదని, తెచ్చిన అప్పులకు వడ్డీలుకడుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం వాటిపై దృష్టి సారించాలని కోరారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం కూడా వారికి న్యాయం చేయలేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

• విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట, జూన్ 8 : నర్సంపేట పట్టణ శివారులో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్‌డిఎస్. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మెడికల్ కళాశాల భవనాన్ని సందర్శించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేశ్, సిద్ధు, గుర్రం అజయ్, శ్యామ్ మాట్లాడుతూ గత సంవత్సరం మెడికల్ కళాశాల మంజూరి కాగా, భవననిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కళాశాల భవన నిర్మాణ పనులను కొద్ది నెలల క్రితం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఆర్డీఓలు సందర్శించి భవననిర్మాణ పనులను ఈ విద్యాసంవత్సరం వరకు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినా పనులు నత్తనడకన సాగుతున్నాయని వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఖరీఫ్ పనులకు రైతులు శ్రీకారం



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

దుగ్గొండి, జూన్ 8 : మండలంలో రెండు రోజులుగా కురిసిన తొలకరి వర్షాలతో వివిధ గ్రామాలలో ఖరీఫ్ పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. వేసవి కాలం తర్వాత తొలకరి వర్షాలతో దుక్కులు దున్నుకున్న రైతులు పత్తి, మొక్కజొన్న, పల్లి విత్తనాలు పంట భూముల్లో విత్తడం ప్రారంభించారు. దీంతో రైతులు, కూలీలు పొలం బాట పట్టి బీజీ బీజీగా తయ్యారయ్యారు. మండలంలో తిమ్మంపేట, మహ్మదాపురం, చలపర్తి, రేకంపల్లి, దుగ్గొండి, మల్లంపల్లి, మైసంపల్లి, స్వామిరావుపల్లి, మర్రిపల్లి, శివాజీనగర్ తదితర గ్రామాల్లో ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

మురుగు కాలువల వ్యవస్థ.. సరిగా లేక అవస్థ



పిచ్చిమొక్కలతో మురుగునీరు నిలిచిన కాలువ

వర్ధన్నపేట, జూన్ 8 : వర్ధన్నపేట పట్టణం, శివారు వార్డుల్లో మురుగు కాలువల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోయి మురుగునీరు కదిలేందుకు వీలులేకుండాపోయింది. పాత మునిసిపాలిటీ కార్యాలయం సమీపంలోని పొద్దుటూరి రామయ్య ఇంటి నుండి అంబేడ్కర్ సెంటర్ వరకు నూతనంగా నిర్మించిన కాలువను నెలలపాటుగా శుభ్రం చేయకుండా మున్సిపాలిటీ సిబ్బంది వదిలేశారు. పారిశుద్ధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పది మందిలోపే ఉండగా ఇద్దరు మాత్రమే డ్రైనేజీలు శుభ్రం చేస్తుంగా మిగతా 8 మంది వీధులు, రోడ్లు ఊడుస్తున్నారు. దీంతో నెలల తరబడి పట్టణ కేంద్రంతోపాటు, గిరిజన తండాల్లో కాలువల్లో మట్టి, చెత్తా పేరుకుపోయి ఉంటున్నాయి. ప్రస్తుతం వర్షాలు పూర్తిస్థాయిలో కురవకపోవడంతో ఈ సమయంలో డ్రైనేజీలు, కాలువలను శుభ్రం చేయిస్తే వర్షాకాంలో దోమల బెడద తక్కువవుతుందని, పరిస్థితి ఇలాగే ఉంటే దోమలతో అల్లాడి పోవాల్సిందేనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బిక్కోజీనాయక్‌తండాలో వైద్య శిబిరం

సంగెం, జూన్ 8 : బిక్కోజీనాయక్‌తండాలో హనుమ కొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశా రు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేటి పాపిరెడ్డి, వైద్యులు కిషన్, మదన్‌మోహన్‌రావు బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌నాయక్ పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టాలి

• దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

వర్ధన్నపేట, జూన్ 8 : హైదరాబాద్ జిల్లాకు అంబేడ్కర్ జిల్లాగా నామకరణం చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. శనివారం వర్ధన్నపేటలో సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చిహ్నంలో మార్పులు ప్రజాభీష్టం మేరకే చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

పార్టీల ఐకమత్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



మాట్లాడుతున్న రాయపురం సాంబయ్య

వర్ధన్నపేట, జూన్ 8 : భారతదేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు ఐకమత్యంతో అప్రమత్తంగా ఉంటేనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు రాయపురం సాంబయ్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్యలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మతపరమైన గుర్తింపుతో కుమ్మక్కై విషపూరిత ప్రసంగాల ద్వారా ప్రజలను విభజించే మోడీ-షా వర్గం వినాశకర ఎత్తుగడలను ప్రజలు ఆ సార్వత్రిక ఎన్నికల్లో తిరస్కరించారన్నారు. 400 ఎంపీ సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని అతివిశ్వాసం వ్యక్తం చేసిన బీజేపీ నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మోడీ, షా, వారి సహచరుల ఆలోచన విధానాలను తుంగలో తొక్కిన ప్రజలకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధం

ప్రారంభ రోజు నుంచే సర్కార్ బడి విద్యార్థులకు అందజేత

నర్సంపేట, జూన్ 8: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభమైన రోజు నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేలా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2004-2005 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో చదివిన విద్యార్థులతో పాటు కొత్తగా చేరే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని గోదాంల నుంచి మండలాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాలకు పాఠ్య పుస్తకాలను సరఫరా చేశారు. జిల్లాలో 724 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో గత విద్యా సంవత్సరం 46వేల 500 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యనభ్యసించారు. వీరికి పంపిణీ చేయడం కోసం సుమారు 2లక్షల 45 వేల 380 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా మొదటి విడతగా 2లక్షల 2వేల 400 పాఠ్యపుస్తకాలను జిల్లా కేం ద్రంలోని గోదాంలకు ప్రభుత్వం సరఫరా చేసింది. అక్కడి నుంచి మండలాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాలకు పాఠ్యపుస్తకాలను చేరవేర్చారు.



నర్సంపేట ఎమ్మార్సీ కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలను చూపుతున్న అధికారి కొర్ర సారయ్య

మొదటి విడతగా 61,368 పాఠ్య, 81,936 నోటు బుక్స్

నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పపాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడానికి పాఠ్య, నోటు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 316 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో సుమారు 16,429 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు. వీరికి పంపిణీ చేయడానికి 1,15,558 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా, మొదటి విడతగా 61,368 పాఠ్యపుస్తకాలను ఎమ్మార్సీ కార్యాలయాలకు సరఫరా చేశారు. అలాగే 81,936 నోటు పుస్తకాలను సరఫరా చేశారు. నర్సంపేట పట్టణం, మండలంలోని 58 పాఠశాలలకు మొదటి విడతగా 18,791 పాఠ్యపుస్తకాలు, 17,377 నోటుపుస్తకాలు ఎమ్మార్సీ కార్యాలయానికి చేరాయి. ఖానాపురం మండలంలోని 36పాఠశాలలకు 6,721 పాఠ్యపుస్తకాలు, 13,725 నోటు పుస్తకాలు, చెన్నారావుపేట మండలంలోని 52 పాఠశాలలకు 7,121 పాఠ్య పుస్తకాలు, 14,589 నోటు పుస్తకాలు, నల్లబెల్లి మండలంలోని 48 పాఠశాలలకు 8,195 పాఠ్యపుస్తకాలు, 9,768 నోటు పుస్తకాలు, దుగ్గొండి మండలంలోని 45 పాఠశాలలకు 8,844 పాఠ్యపుస్తకాలు, 7,009 నోటు పుస్తకాలు, నెక్కొండ మండలంలోని 77పాఠశాలలకు 11,656 పాఠ్యపుస్తకాలు, 19,468 నోటు పుస్తకాలను ఎమ్మార్సీ కార్యాలయాలకు చేరవేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఇంకా 54,190 పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాల్సి ఉంది.

నర్సరీల్లో సిద్ధంగా హరితహారం మొక్కలు

67400 మొక్కలు నాటేందుకు ప్రణాళిక

34 జీపీలలో 4లక్షల వరకు మొక్కలు సిద్ధం

దుగ్గొండి, జూన్ 8 : వర్షా కాలంలో హరితహారం మొక్కలు నాటేందుకు 34 జీపీలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో 4లక్షల వరకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వాతావరణ కాలుష్యం నివారణతో అధిక వర్షపాతం నమోదుకై హరితహారం ద్వారా మొక్కలను పెంచుటకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపుల ఆసక్తి ఉన్న రైతుల భూములతోపాటు ప్రతి నివాసగృహంలో చెట్లు పెంచే విధంగా ప్రోత్సహిస్తారు. వర్షాకాలంలో మండలంలో 67400 మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు తయారుచేసి నర్సరీలను ఏర్పాటుచేశారు. నర్సరీలలో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని గ్రామాల్లోని సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.



చలపర్తి నర్సరీలో పూల మొక్కలు

నర్సరీలలో పెంచే రకరకాల మొక్కలు

నర్సరీలలో సుమారు 20రకాల మొక్కలను పెంచారు. నీడను ఇచ్చే, పండ్ల , పూల మొక్కలకు ప్రధాన్యత ఇచ్చారు. గతంలో ప్రతి నర్సరీలో 3వేల నుంచి 4 వేల వరకు మొక్కలు ఉండగా ఈ ఏడాదికి గాను ప్రతి నర్సరీలలో అదనంగా 6 వేల మొక్కలను పెంచే విధంగా చర్యలు తీసుకున్నారు. జాతీయ ఉపాధి పథకం ద్వారా సిబ్బందిని నియమించి గ్రామ కార్యదర్శి పర్యవేక్షణ చేయడంతో పాటు మండలస్థాయి అధికారులు సూపర్‌వైజర్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్షాలు కురియగానే మొక్కలు నాటేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

అధిక ఉష్ణోగ్రతలతో అవస్థలు

గతంలో కంటే అధిక ఉష్ణోగ్రతలు ఉండడం వల్ల నర్సరీ పెంచే బాధ్యులు ఈసారి ఎక్కువ అవస్థలు ఎదుర్కొన్నారు. రోజుకు రెండు నుంచి మూడు సార్లు నీటిని అందించడంతో పాటు ప్రతి నర్సరీకి గ్రీన్ నెట్లు ఏర్పాటుచేసి వేడి నుంచి రక్షించి మొక్కలు పెరిగే విధంగా చర్యలు తీసుకున్నారు.

మొక్కలు సిద్ధంగా ఉన్నాయి..

శ్రీధర్, ఎంపీవో, దుగ్గొండి



వర్షాకాలంలో హరితహారంలో మొక్కలు నాటేందుకు నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. గ్రామాల్లోని నర్సరీ బాధ్యులు, గ్రామ సిబ్బంది తగు జాగ్రత్తలతో మొక్కలు పెంచారు. ప్రతి నివాస గృహానికి ఐదు రకాల మొక్కలను అందిస్తారు. ప్రభుత్వ కార్యాలయా లు, రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ మొక్కలను నాటుతారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వర్ధన్నపేట, జూన్ 8 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన వర్ధన్నపేట పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రాంతంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే దమ్మన్నపేటకు చెందిన గూడూరు వెంకటేశ్వర్లు వర్ధన్నపేటకు వ్యక్తి గత పనుల నిమిత్తం వచ్చి, ఇంటికి తిరిగి ప్రయాణమవ్వగా ఫిరంగడ్డ ప్రభుత్వ పాఠశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తు తెలియని ఆటో వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రామోజీరావుకు ఘన నివాళులు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

వర్ధన్నపేట, జూన్ 8 : ఈనాడు, ఈటీవీ సంస్థల చైర్మ న్ రామోజీరావుకు వర్ధన్నపేట జర్నలిస్టులు ఘన నివాళులర్పించారు. శనివారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌వద్ద ఆయన చిత్రపటానికి కొవ్వొత్తులతో శ్రద్ధాంజ లి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీరాం రమేష్, మచ్చ సమ్మయ్య, మహ్మద్ అహ్మద్, మంచోజు సత్యనారాయణ, మేరుగు హరీష్, జయకృష్ణ, సతీష్, మోడెం రఘుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ పోయిందా.. ఇలా చేయండి

వర్ధన్నపేట రూరల్, జూన్ 8 : ఎవరైనా తమ ఫోన్‌పోగొట్టుకున్నా, చోరీఅయినా ఇంతకుముందు దానిపై ఆశలు వదులుకోవాల్సి వచ్చేంది. ప్రస్తుతం మీ సేవా కేంద్రం ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేస్తేసరిపోతుంది. వారు ఆ ఫోన్ ఎక్కడుందో కనిపెట్టి రికవరీ చేసి బాధితులకు అందిస్తారు.

ఐఎంఈఐ ఆధారంగా...

సీఈఐఆర్ సేవలు స్మార్ట్‌ఫోన్ ఐఎంఈఐ ఆధారంగా పనిచేస్తుంది. సీఈఐఆర్ కోసం దేశంలోని మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లు, మొబైల్ తయారీ సంస్థలు సంయుక్తంగా డీవోటీ యూజర్లకు సేవ లందిస్తున్నాయి. సీఈఐఆర్ వెబ్, మొబైల్ యాప్ వర్షన్లలో యూజర్లకు అందుబాటులోఉంది. నో యువర్ మొబైల్ అనే పేరు మొబైల్ యాప్ వర్షన్‌ఉంటుంది. మొబైల్ యూజర్ వ్యక్తిగత డిటైల్స్, సదరు వ్యక్తి పేరు, అడ్రస్, గుర్తింపు కార్డు, ఈ మెయిల్ తదితర వివరాలు నమోదు చేసి సబ్మిట్‌పై క్లిక్ చేయాలి. అటుపై యూజర్ ఫిర్యాదు స్వీకరిస్తున్నట్లు రిక్వెస్ట్ ఐడీ నంబర్ వస్తుంది. కంప్లయింట్ స్టేటస్ తెలుసుకోవడానికి ఉపయోపడతుంది. యూజర్ వివరాల ఆధారంగా మొబైల్ ఫోన్ నంబర్‌ను 24 గంటల్లో సీఈఐఆర్ బ్లాక్ చేస్తుంది. ఫోన్ వివరాలను మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లకు పంపుతుంది. సీఈఐఆర్ బ్లాక్ చేసిన ఫోన్‌లో ఎవరు సిమ్‌కార్డు వాడినా వెంటనే అలర్ట్ సందేశం వస్తుంది. ఈ మెసేజ్‌తో యూజర్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ఏ ప్రాంతంలో ఉన్నదో తేలిగ్గా తెలుసుకోవచ్చు.

ఫిర్యాదు ఇలా..

ఫోన్‌కు సంబంధించిన వివరాలతో మీ సేవా కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత, ఆ దరఖాస్తును మళ్లీ పోలీసు స్టేషన్‌లో మాన్యువల్‌గా ఇవ్వాలి. వారు కేసు నమోదు చేసుకుని, సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్, స్టోలెన్ మొబైల్ అనే లింక్‌పై క్లిక్ చేసి వివరాలను నమోదు చేస్తారు. ఓటీపీ కోసం మరో మొబైల్ నంబరును ఇవ్వాల్సి ఉంటుంది. తరువాత ఒక ఐడీ నంబరు వచ్చి మొబైల్‌లో దానంతట అదే బ్లాక్ అవుతుంది. తర్వాత మనమిచ్చిన ఫోన్ నంబరుకు మెసేజ్ వస్తుంది. దాని ఆధారంగా పోలీసులు ఈ పోర్టల్ ద్వారా ఫోన్ ఎక్కడ ఉంది అనేది కనుక్కొని బాధితులకు అందచేస్తున్నారు.

కాగా, మండల పరిధిలో 2023 నుంచి ఇప్పటి వరకు వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 103 పోయినట్లు దరఖాస్తులు రాగా, 62ఫోన్లను కనుగొని బాధితులకు అందించారు. 41 ఫోన్లు బ్లాక్ లిస్టులో ఉండగా వాటిని ట్రేజ్ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. 2024లో ఐదు నెలల్లోనే 58దరఖాస్తురాగా, 22మంది ఫోన్లను కనుగొని ఇచ్చినట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి.

బ్లాక్ దందా.. అధికారుల అండ..

(5వ పేజీ తరువాయి)

తగ్గించేందుకు ఏం చేయాలన్న పూర్తి సమాచారం రైతులకు అందించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులదే. పత్తి విత్తనాల రకాలు వేరైనా అన్ని ఇంచుమించు ఒకే విధమైన దిగుబడిని ఇస్తాయని చెబుతున్నారనీ విషయంలో రైతుల్ని చైతన్యపర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. వ్యవసాయశాఖలో కొందరు అధికారులు ఏళ్ల నుంచి పాతుకుపోయారు. దీంతో అక్రమార్కులతో సన్నిహితంగా ఉంటూ దందాకు తమవంతు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతపంటలే ప్రమాణికం..

ఏటా వ్యవసాయశాఖ పంట ప్రణాళిక రూపొందించి వాటికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి. కానీ ఈసారి జిల్లాలో 2023లో పంట ప్రణాళికనే 2024 పంట ప్రణాళికగా వ్యవసాయ అధికారులు ప్రకటించారు. గత ఏడాదిలో ఏ పంట ఎక్కువగా సాగు చేశారు.. ఏది అధిక దిగుబడి వచ్చింది.. ఏది ధర పలికింది.. తదితర అంశాలపై ఎలాంటి ప్రణాళిక లేకుండానే ప్రకటించడంపై రైతులు సంఘాలు మండిపడుతున్నాయి.

చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి..

మోర్తాల చందర్‌రావు, తెలంగాణ రైతు సంఘం కన్వీనర్

చట్టాలను కచ్చితంగా అమలు చేస్తేనే రైతులు మేలు జరుగుతుంది. సాగు మొదలు పంట చేతికి వచ్చి మార్కెట్లో అమ్ముకునేంత వరకు రైతులక అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. కల్తీ విత్తనాలు, అధిక ధరలకు అమ్మినా పీడీ యాక్టు కింద కేసులు అంటున్నారు. ఇప్పటి వరకు ఒక్కకేసు నమోదైన దాఖలాలు లేవు. అక్రమార్కులకు కొందరు అధికారులు మామూళ్లకు అలవాటుపడి వత్తాసు పలుకుతున్నారు.

ఎల్లగౌడ్‌కు నివాళి

సంగెం, జూన్ 8 : ఎంసీపీఐ నేత నారగోని ఎల్లగౌడ్ ఆశయాలను కొనసాగిస్తామని ఎంసీపీఐ నేతలు చెప్పారు. శనివారం ఎల్గూరు రంగంపేటలో ఏర్పాటు చేసిన సంతాప సభలో నివాళులర్పించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనే కుమారస్వామి మాట్లాడుతూ మండలంలో పేదల పక్షాన పోరాటంచేసిన ఘనత ఎల్లగౌడ్‌కు దక్కిందన్నారు. ఐక్య ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల సాధన కోసం పార్టీచేపట్టిన ఉద్యమంలో వృద్ధాప్యంలోనూ పోరాడాడన్నారు.మండల కార్యదర్శి ఇస్మాయిల్,నాయకులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



గట్టికల్లులో బురదమయంగా రోడ్డు

రాయపర్తి, జూన్ 8 : మండలంలోని గట్టికల్లు గ్రామంలోని ఊకల్‌కు వెళ్లే దారిలో రహదారి బురదమయంగా దర్శనమిస్తోంది. సీసీ రోడ్డుపై కొన్ని రోజుల క్రితం మట్టి పోయడంతో చినుకుపడితే బురదమయంగా మారుతోంది. సీసీ రోడ్డు వేసినప్పటికీ కాంట్రాక్టర్ లెవల్ చేయకపోవడంతో స్థానికులు మట్టినిపోశారు. దీంతో వాహనాల రాకపోకల కారణంగా వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. అధికారులు దృష్టి సారించి మట్టిని తీసి రోడ్డును లెవల్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చెట్ల తొలగింపు



వెంకటాపురం బీటీ రోడ్డు వద్ద చెట్లను తొలగించిన జడ్పీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

దుగ్గొండి, జూన్ 8 : మండలంలోని గిర్నిబావి, నుంచి దుగ్గొండికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న చెట్లతో తరచుగా ప్రమాదాలు జరుగుచుండగా ప్రజల విజ్ఞప్తి మేరకు జడ్పీవైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ సొంత ఖర్చులతో శనివారం చెట్లనుతొలగించారు. రోడ్డుపక్కన ఉన్న చెట్లను పెంచి ఏళ్లు గడవగా, చెట్లు ఎండిపోయి రోడ్డుపై ప్రయా ణిస్తున్న వారిపై కొమ్మలు విరిగిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చెట్లు తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేసినట్లు శ్రీనివాస్ వెల్లడించారు.

మృగశిర కార్తె సందడి

రాయపర్తి, జూన్ 8: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల వద్ద మృగశిర కార్తె సందడి నెలకొంది. శనివారం మృగశిర కార్తె కావడంతో చేపలు తినేందుకు గ్రామస్థులు చెరువులు, కుంటల వద్దకు బారులు తీరారు. ఇక మండల కేంద్రంలో సైతం చేపల మార్కెట్ వద్ద ప్రజలు గుమిగూడి కనిపించారు. మృగశిర సందర్భంగా చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజలు నమ్మకం.

• దుగ్గొండి : మృగశిర కార్తె సందర్భంగా శనివారం చేపలు కొనేందుకు మార్కెట్లవద్ద ప్రజలు బారులు తీరారు. వివిధ గ్రామాల్లో మత్స్యకారులు ఉదయాన్నే చెరువుల్లో దిగి చేపలు పట్టారు. చేపల కొనుగోలుకు చెరువుల వద్దకు గ్రామస్థులు తరలివెళ్లారు. కిలో రూ.150లకు అమ్మే చేపలు మృగశిర కార్తెను పురస్కరించుకొని రూ.200లకు విక్రయించారని పలువురు వాపోయారు.

కస్తూర్బాలో నాణ్యమైన విద్య



అధునాతన వసతులతో వంచనగిరిలో నిర్మించిన కస్తూర్బా భవనం

బాలికల విద్యకు అండగా విద్యాలయాలు

6వ నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల విద్యాబోధన

హాస్టల్ వసతితోపాటు

పౌష్టికాహారం, మౌలిక వసతులు

గీసుగొండ, జూన్ 8 : సమగ్ర శిక్షాభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా బాలికా విద్యాలయ (కేజీబీవీ)లు బాలికలకు వరంగా మారాయి. 6వ తరగతిలో అడ్మిషన్ పొందితే ఇంటర్ వరకు చదువుకోవచ్చు. ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉన్న ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును కూడా అందిస్తున్నారు. యోగ, కరాటే వంటి వాటిని కూడా నేర్పిస్తారు. అనాథల పిల్లలు, ఆర్థిక పరిస్థితులతో మధ్యలో బడిమానేసిన పిల్లలు, చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి కేజీబీవీలో తొలి ప్రాధాన్యమిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున పదేళ్ల క్రితం ఈ విద్యాలయాలను అందుబాటులోకి తెచ్చారు. మొదట తెలుగు మీడియం ఉండగా, తర్వాత ఇంగ్లీష్ మీడియంగా మార్చారు. ప్రస్తుతం 6వ తరగతిలో అడ్మిషన్‌లను తీసుకుంటున్నారు. మొదట్లో 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే విద్యాలయాల్లో బోధన ఉండేది. తర్వాత ఇంటర్, వొకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టారు. అధునాతన వసతులతో డిజిటల్ క్లాస్‌రూంలు, ల్యాబ్‌లు, డైనింగ్ హాల్, యూరినల్స్, మరుగుదొడ్లు, డార్మెట్రీ ఉండే విదంగా మూడంతస్తులతో నూతన భవనాలను ప్రభుత్వం నిర్మించింది. ఈ విద్యానిలయాలు పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో కొనసాగుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిలుస్తున్నాయి.

జిల్లాలో 10 కస్తూర్బా విద్యాలయాలు..

జిల్లాలో 10 కస్తూర్బా బాలిక విద్యాలయాలు ఉన్నాయి. గీసు గొండ, సంగెం, రాయపర్తి, పర్వతగిరి, నల్లబెల్లి, చెన్నారావుపేట, వర్ధన్నపేట, ఖానాపురం, దుగ్గొండి, నెక్కొండ మండ లాల్లో వీటిని ఏర్పాటు చేశారు. 6నుంచి 10వ తరగతి వరకు ఒక్కో క్లాస్‌లో 40మంది చొప్పున పాఠశాలలో 200 మంది చదువుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 2000 మంది విద్యనభ్యసించవచ్చు. ప్రతీ సంవత్సరం మే నుంచే 6వ తరగతి, మిగిలిన తరగతుల్లో ఖాళీ అయిన సీట్లలో అడ్మిషన్‌లు తీసు కుంటారు. ఇంటర్‌లో ప్రవేశాలకు గీసుగొండ, నల్లబెల్లి, చెన్నారావు పేట, సంగెం కస్తూర్బా విద్యాలయా ల్లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు తెలుగుమీడియం అందిస్తుండగా, వర్ధన్నపేట, ఖానాపూర్ లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ఇంగ్లీష్ మీడియంలో అందుబాటు లో ఉన్నాయి.

సీఆర్టీ, పీజీసీఆర్టీలచే ఉత్తమ బోధన

కేజీబీవీలలో బీఈడీ,ఎంఈడీ చేసిన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్టీ)లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెన్షియ్ టీచర్(పీజీసీఆర్టీ)లు విద్యాబోధనచేస్తారు. క్రాఫ్ట్ టీచర్‌లు కూడా అందుబాటులోఉండి చేతినైపుణ్యాలను నేర్పిస్తారు. యోగా, మార్షల్ ఆర్ట్స్, నృత్యాలు, చిత్రలేఖనం వంటి వాటిల్లో కూడా శిక్షణ ఇస్తారు. ఏదైనా ఆరోగ్య సమస్యలువస్తే ప్రాథమిక చికిత్స చేసేందుకు ఏఎన్ఎం ఇందులో ఉంటారు. ప్రతి రోజు ముగ్గురు టీచర్‌లు నైట్‌డ్యూటీలో ఉంటారు.విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికహారంతో పాటు ఉచితంగా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, దుప్పట్లు, కాస్మోటిక్ కిట్‌లు అందిస్తారు.

బాలికలకు బంగారు భవిష్యత్

ఫ్లోరెన్స్, ఎస్ఎస్ఏ జిల్లా బాలికల సెక్టోరియల్ అధికారిణి



చదవాలనే ఆసక్తి ఉన్న బాలికలకు కేజీబీవీలు బంగారు భవిష్యత్‌ను ఇస్తాయి. అనాథ పిల్లలకు, బడిమానేసిన, ఆర్థికంగా వెనుకబడిన బాలికలకు ఇదొక వరం. నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్య రక్షణ, పౌష్టికహారం ప్రభుత్వం అందిస్తుంది.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి, జూన్ 8 : వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపును హర్షిస్తూ శనివారం మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి శ్రీనివాస్, తాడోజు శ్రవణ్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

• సంగెం : ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపొందడంతో శనివారం సంగెంలో కాంగ్రెస్ నేతలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుగా శాసన మండలిలోకి అడుగు పెడుతున్న మల్లన్నకు పార్టీ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మధవ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, యువ జన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగపాటి రాజుగౌడ్, గవిచర్ల ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, నాయకులు కందకట్ల నరహరి, కిషోర్ కుమార్, కోటేశ్వర్, గూడ కుమారస్వామి, రాజశేఖర్, జగన్నాథచారి పాల్గొన్నారు.